# బాధ్యులెవరు?

## శ్రీమతి వెలిదండ చూడికుడుత్తమ్మగారు

నా తండ్రిగారి చావుతో నా బి.ఎ. చదువు సగంలో ఆపివేయవలసివచ్చింది. నన్ను చిన్నప్పటి నుండీ కన్నబిడ్డకంటె ఎక్కువ ప్రేమతో పెంచుతూ వచ్చిన మేనత్తకన్న దగ్గరచుట్టాలు ఇంకెవ్వరూలేరు. నా అభిమానవిద్య సంగీతము. అయినప్పటికీ దానిని కూడా ఆపివేశాను.

మా మేనమామకుమారుడు మా ఊరిలోనే ఒక కంపెనీలో భాగస్వామిగాఉండి పనిచేస్తూఉన్నాడు. మాకు బంధువవటం, మే మిద్దరమూ ఒక కాలేజీలోనే చదువుతూఉండటంబట్టి మా ఇద్దరిమధ్య ప్రేమబీజాలు నాటాయి. అవి క్రొత్తగా ఇప్పుడు నాటబడినవికావు. ఈసంగతి గ్రహించిన మా తండ్రిగారు మమ్మల్ని ప్రోత్సహించి వివాహమునకు ఏర్పాటుచేశారు. కాని, కాలము ఆయనను తనవాత వేసుకొనినది. మా తండ్రిగారు పోయిన కొన్ని నెలలలోనే మాకు వివాహము జరిగినది.

నాభర్త అయిన రామారావుగారు తనపనిని చాల ఉత్సాహముగాను, ఆశాపూరితంగాను, సంతృప్తికరంగాను జరుపుకుంటున్నారు. మాకు కొన్ని దినాలకు ఇద్దరు కుమారులు కలిగారు. పెద్దవాడిపేరు రఘు. చిన్నవాడిపేరు కేశవుడు. వీళ్లిద్దర్ని చూసుకుంటూఉన్న మాకు చాలా ఆనందంగా ఉండేది. నాకుమాత్రము 'ఒక ఆడుపిల్లఉంటే బాగుండును' అని ఒక్కొక్కప్పుడు అనిపించేది. కొన్నాళ్లకు తిరిగి నేను నెలతప్పాను. నా సంతోషం చెప్పలేను. కాని ఆ మాటూకొడుకే పుట్టాడు. ఏంచేయగలను? భగవంతుని దయవలన ఆడపిల్లమీదఉండే నా కోరిక వృథా కాలేదు. ఆపిల్లవాడు పెరుగుతూవున్న కొద్దీ శరీరంలో ఉండే సౌకుమార్యము, వయసుకుమించిన ఉత్సాహము, ఆ గాత్రమాధుర్యము, ఆ సంగీతకళాభిరుచి ఈ మొదలగునవన్నీ మమ్మల్నిద్దర్నీ వళ్లు మరపించాయి. నా ముద్దుకొద్దీ చిన్నికృష్ణమ్మ అని అతనిని పిలుచుకునేదాన్ని. అతడు వాళ్లన్నలవలె గాక తండ్రి దగ్గరకంటె నాదగ్గరే ఎక్కువ చనువుగా ఉంటూ, ముద్దుముద్దుగా సంగీతం కూనిరాగాలు తీసుకుంటూ, నాచుట్టూ తిరుగుతూ కాలక్షేపం చేసేవాడు. అప్పుడప్పుడూ నా భర్తగారు నన్ను చూచి "వాడిని మరీ ముద్దుచేస్తున్నావు. శరీరపరిశ్రమ విషయంలో నీవు తగినంత శ్రద్ధనియ్యకపోతే నిష్కారణంగా అబ్బాయిశరీరం ఉండవలసినంత ఆరోగ్యంగా ఉండదేమో సుమా" అని మందలిస్తూ ఉండేవారు. ఆ పిల్లవాడియందుండే మమకారంచేతనూ, నన్ను వదలి దూరంగావెళ్లడానికి కుఱ్ఱవాడు ఎక్కువ ఇష్టంగాలేనందుననూ ఆయన మాటలను లక్ష్యంచేసేదాన్నిగాను. క్రమంగా చిన్నికృష్ణమ్మకు ఏడవ సంవత్సరం వచ్చింది. అన్నలు బళ్లోకివెళ్లి నేర్చుకొని వచ్చినదానికంటె వాళ్ల సంభాషణలు విని ఇతడు నేర్చుకొని కనబరచిన బుద్ధివికాసాన్ని చూచి మే మిద్దరము మహాశ్చర్యపడుతూ ఉండేవాళ్లము.

ఒకరోజు సాయంకాలము నా భర్తగారు షికారు వెళ్లబోతూ అన్నలతోబాటు చిన్నకృష్ణమ్మనూ తీసికొని వెళ్లినారు. ఆరున్నర గంటలకల్లా పెద్దవాన పట్టుకున్నది. తండ్రీ కొడుకులు వానలో తడిస్తేనే గాని ఇంటికిరావడం పడిందిగాదు. నేను భయపడు

---

ఆంగ్లమున "True Story Magazine"లో ప్రచురింపబడిన యొక స్త్రీ ఆత్మకథననుసరించి వ్రాయబడినది.

తున్నట్టుగానే మా చిన్నికృష్ణమ్మకు జలుబుచేసి జ్వరమువచ్చింది. చివరకు కఫజ్వరము క్రిందబెట్టి అకాలమృత్యువు వాతపడ్డాడు.

ఇంక నాకేముంది? ప్రపంచంఅంతా నిస్సారం అయిపోయింది. నేను మనిషిగా ఉన్నానో రాయిగా ఉన్నానో నాకే తెలిసిందిగాదు. నా చుట్టు ప్రక్కలఉన్న వస్తువులన్నిటిలోను నా చిన్నికృష్ణమ్మ కనబడుతూవచ్చాడు. వాడు నాచుట్టు తిరుగుతూ ఉన్నట్టుగానే సమస్త పదార్థములు నాచుట్టూ గిరగిర తిరిగిపోతూఉన్నవి. వాని ముద్దుమాటలు పాటలు నాచెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. నేను వీటినిచూచి భరింపలేకపోయాను. మొగమెత్తి ఒక్కర్ని చూచి ఒకమాట మాటాడలేదు. ప్రక్కమీద శూన్యహృదయంతో పడుకోవటంతప్ప రెండోది ఏమీ తోచేది కాదు. నాకడుపు నేయినెగళ్ల మంటవలె మండి పోతూఉన్నది.

మర్నాడు ఉదయం నా భర్తగారు నే పడుకున్న మంచందగ్గిరకు వచ్చి నన్ను ఓదార్చటానికి ప్రయత్నించారు. ఆయనను చూచి చూడటంతోటే నా దుఃఖమల్లా గొప్ప అగ్నిహోత్రజ్వాలలాగ కోపరూపంగా పైకుబికి "మీరు నాబిడ్డను చంపిన హంతకులు. ఇకపైని మీమొగం ఎంతమాత్రం నాకు చూపించ నవసరంలేదు. ఏమాత్రమైనా ఆశపడతారేమో. ఆ ఆశ ముమ్మాటికీ పెట్టుకోవద్దు. కలలోకూడా పెట్టుకోవద్దు." నా నోటివెంట వచ్చిన ఈమాటలు ఏలాగు విన్నారో నాకే తెలియదు. నిలువునా నీరై తెల్లగా వాలిపోయి నిర్ఘాంతపడి నావైపు చూచారు. పెదవి మెదపలేదు. పెదవి కదిపిన అగ్నిహోత్రానికి నేయి పోసినట్టవును గాని నీరు పోసినట్టు కాదని ఆ లోతుహృదయానికి తెలుసు. మెల్లగా పిల్లిపిల్ల లాగు గదిలోనుంచి బయటికి వెళ్లిపోయినారు. నేనేమీ మాటాడలేదు. సముద్రతరంగాల్లాగ నా హృదయంలో కోపతరంగాలు అంతులేకుండా పని చేస్తున్నాయి. నా చిన్నితండ్రియొక్క అకాలమరణానికి నాభర్త కారణభూతు డనిపించినాడు. ఏ విధంగానైన అతనిమీద పగదీర్చుకోవాలని దృఢసంకల్పం కలిగింది. నే నిప్పుడనుభవిస్తూన్న బడబానలంలాంటి ఈ దుఃఖంకన్నా ఎక్కువైన బాధను అతనికి కలిగిస్తేనే గాని నా హృదయదవానలం చల్లారదనుకున్నాను. అతడు తప్పకుండా ఈ శిక్షకు గురి కావలసిందే. గురికాక తప్పదు. ఎందుకంటే అతనికి నామీదవుండే ప్రేమ హద్దులేనిది. అతనికి నే నుంటేనేగాని జీవనమే లేదు.

ఆమర్నాడు సాయంకాలం ఆఫీసునుంచి మామూలుగా తన దుస్తులు మార్చుకోటానికి గదిలోనికి వచ్చారు. నేను అతనినిచూచి అక్కడనే బట్టలతో ఉన్న ఒక కుర్చీని చూపించి మూడేమూడు మాటలు మాట్లాడాను. "రేపుదయం వేసుకోవలసిన బట్టలు అవిగో, ఆ కుర్చీమీద ఉంచాను. ప్రస్తుతం వాటిని తీసికొని మీ ప్రత్యేకమైన గదిలోనికి వెళ్లిపోండి. మన కా సామానులను తెల్లవారిన తరువాత ప్రత్యేకం చేసి మీవద్దకు పంపివేస్తాను. మీ కీ గదిలోనే ఉండవలెనంటే నేనే వేరొక గదిలోనికి వెళ్లిపోతాను." ఆమాటలు విన్నారు. ఈవరకు తిన్న దెబ్బతోనే బాధపడుతూ లేవ ప్రయత్నించేవాడికి తిరిగి చెంపమీద గూబ గుంయ్యమనే చెంపకాయ తిన్నవాని మొగంలాగు అతని మొగం మారిపోయింది. కాని తిరిగి ఒక్కపలుకు పలకలేదు. కళ్లు విప్పలేదు. మొగంలోమట్టుకు ఏదో తీవ్రమైన ఆవేదనను అణచుకొనటానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడింది. నిరంకుశాధికారియొక్క నిరంకుశానికి గురియైన అమాయికపు తాబేదారువలె గదివిడిచి వెళ్లిపోయారు. అందువల్ల నాలో ఏమీ మార్పు కలగలేదు. అతని సామానులన్నీ సర్ది వేరొక గదిలోనికి నేను మార్చుతూఉండటం మా మేనత్త ప్రక్కగదిలోంచి చూస్తూఉంది. లాభంలేదనీ, ధైర్యంలేకనే నన్ను ఎదుర్కోలేదు.

ఆమె చూచే చూపుల్లో విచారం నేను చూస్తూఉన్న ఆవకతవకపు పనులకు అయిష్టమూ స్పష్టంగా కనబడింది. ఆమె నన్ను పెంచి పెద్దదాన్ని చేసిన మాట నిజమే. ఆమెకు బిడ్డలు లేనందువల్ల గర్భకష్టం గురించి ఆమె ఎంతమాత్రం గ్రహించలేదని నా నమ్మకం.

౨

ఈవిధంగా మూడు నెలలు గడిచాయి. మొట్టమొదట్లో రఘు, కేశవులు, తమతల్లిదండ్రుల మధ్య ఉండే ఈ మెరమెరలను గ్రహించలేదు. తమతమ్ముని చావుదలవిచారమే మాయిద్దరిమానములకు కారణమనుకున్నారు. కొన్నాళ్లకల్లా ఏదోఒక ప్రత్యేక కారణం తమకు తెలియనిది మా ఇద్దరమధ్య ఉందనిన్ని కేవలము తమ్ముని చావుదలవిచారము కాదనిన్ని గ్రహించారు. ఏమైన సలహాలు ఆలోచనలు కావలసినప్పుడు తండ్రిగారిదగ్గరకువెళ్లి పొందుతూ ఉండేవారు. తమకు ఆటవస్తువులు కొనుక్కోవాలని బుద్ధిపుట్టినప్పుడు, ఆకలివేస్తే ఏమైనాచిరుతిండి కావలసివచ్చినప్పుడు, బట్టలు పాతలు అడుగవలసి వచ్చినప్పుడు, నాదగ్గరకు వస్తూఉండేవారు. నాకు నా భర్తమీద ఉండే కార్పణ్యం పిల్లన్ని ఈషణ్మాత్ర బాధించకూడదని నా ఉద్దేశం. నాకూ ఏకాంతవాసం దుస్తరమనిపిస్తూ వచ్చింది. ఊళ్లోకొంచం తిరుగుతూ ఉండాలని బుద్ధిపుట్టింది. ఆరోజు తెల్లవారంగానే లేచి మేడమీద నుండి క్రిందికి దిగాను. నా చిన్నికృష్ణమ్మ చనిపోయిన మూడుమాసాలకు అదే మొదటిసారి క్రిందికి నేను రావటం. నేనువచ్చేటప్పటికి పిల్లలిద్దరూ, వాళ్లతండ్రీ కాఫీలు, ఫలహారాలు మాఅత్త ఇస్తూవుంటే తింటున్నారు. నన్నుచూడంగానే పిల్లలిద్దరు ఒకేగొంతుకతో "అమ్మా? ఇన్నాళ్లకు క్రిందికిదిగివచ్చావు. మాతోకూచోని కాఫీపుచ్చుకొందూరా. ఇలారా" అని వాళ్లిద్దరూ కొంచం ఎడంఎడంగా జరిగి నాకు చోటిచ్చారు. నాభర్త తనమొగం ఎత్తలేదు. ఆ ఉన్నతమైన వక్షస్థలం, ఆ ఎగు భుజాలు, ఆ విశాలమైన, ఫాలప్రదేశము, ఉత్సాహతేజోప్రదీప్తములగు ఆసోగకన్నులు; కన్నెత్తిచూడవలసిన ఆ ఆజానుబాహు విగ్రహము ఆనాడు అస్వాభావికముగ ముగ్గబెట్టబడిన పండువలె శరీరమంతాకృంగి ముడతలుపడి ఉత్సాహశూన్యంగా పిల్లలుప్రక్క కూర్చోటంచూచి నేను మహాశ్చర్యపడ్డాను. అతనిలో అణచిపెట్టబడుతూ ఉన్న నిగూఢమైన పరితప్తత అతనిని మాడ్చివేయుచూ ఉన్నదని తెలుసుకున్నాను. నాలోకదలిక ఏమీ కలక్కపోవడం సరిగదా అతను అట్టి బాధను అనుభవించి తీరవలసిందనే నానమ్మకం. పిల్లలతో మామూలుగా మాట్లాడాను. వాళ్లుబడికివెళ్లిపోయినారు. నాభర్త ఆఫీసుకువెళ్లిపోయినారు. సాయంత్రం మామూలుగా ఇంటికి రావటం తన గదిలోనికి తిన్నగా వెళ్లి పడుకోవడంతప్ప క్లబ్బులకు వెళ్లటంగాని టెన్నీసు మొదలగు ఆటలకు మునుపటివలె వెళ్లటంగాని పూర్తిగా మానివేశారు. ఎప్పుడూ పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చోని పిల్లలేదేనా అడుగుతే జవాబు చెపుతూ తప్పించుకునేవారు. ఈ విధంగా ఆయన కాలక్షేపం జరుపుకుంటూ ఉండేవారు. నేనూ, పసుపుకుంకానికి స్నేహితులిళ్లకి, అప్పుడప్పుడు క్లబ్బుకు, మీటింగులకు వెళుతూఉండేదాన్ని. స్నేహితులలో చదరంగం, పేక, మొదలగు ఆటల్లో పాల్గొనేదాన్ని. ఇదంతా వాటియందు సరదా చేతకాదు. కేవలమూ నాకాలక్షేపంకోసరం. ఎవరైనా బంధువులు స్నేహితులు మమ్మల్నిద్దర్ని ఆహ్వానిస్తే నేను సాధ్యమైనంతమట్టుకు తప్పించుకునే తిరుగుతూఉండేదాన్ని. తప్పనిసరి అయినప్పుడు మామూలుగా వెళ్లి అందరితోబాటు నేనుకూడా ఆ కార్యకలాపాల్లో పాల్గొనేదాన్ని. సాధ్యమైనంతవరకూ మాఇద్దరి కలతలూ మాఇద్దరిలోనే ఇమిడి ఉండేటట్టు చూచుకునేదాన్ని. రోజులు గబగబా వెళ్లిపోతూఉన్నాయి. నాకేమో ఆఇంట్లోనే ఆవిధంగా ఉండటం దుస్తరమనిపిస్తూవచ్చింది. నేనెక్కడికి వెళ్లుదామనుకున్నా

పిల్లలకి అనవసరంగా వెత్తిని కలుగజేసినదాన్నవుతాను. వాళ్లిద్దరూ తమ కాళ్లమీద తాము నిలవబడి ఒకఇంటివారైనదాక నేను నావిధిని వాళ్లయందు నెరవేర్చవలసి వుంటుంది.

3

ఈలాగే ఏడుసంవత్సరాలు గడిచాయి. అనేక మార్పులు జరిగాయి. మా ఇద్దరిమధ్యఉన్న కోటగోడవంటి అడ్డుతోనే ఆ నాళ్లు ఆఇంట్లోనే ఆలాగే గడిపాము. పెద్దవాడు మెడికలు మొదటి తరగతిలో ప్యాసైనాడు. రెండోవాడు ఎప్పుడూ అన్నగారి ఛాయను అనుసరించే తిరుగుతూ ఉంటాడు. వాడు మెడికలే చదువుతూఉన్నాడు. అదృష్టవశాత్తు రఘుకు వెంటనే మంచిఉద్యోగం దొరకటం, వివాహం జరగటం, అయిపోయింది. చిన్నవాడు ఇంకను చదువుతున్నాడు. నాభర్త ఇక్కడనుండి పనిమీద కాబోలు రెండురోజులై ఇంకోఊరికి వెళ్లిపోయినారు. పిల్లలిద్దరికి రెక్కలువచ్చి పూర్తిగా జ్ఞానం తెలిసింది. వారికీ నామీద అంతకంతకూ గౌరవము ప్రేమ నశించి అసహ్యభావం ఏర్పడింది. నన్నుపెంచి పెద్దదానిని జేసి నాయొక్క యోగక్షేమమే పరమావధిగా పెట్టుకున్న నామేనత్త గతించింది. ఆమె అంత్యక్రియలన్నీ యథావిధిగా జరిపించి వేశాను. నాకిక ప్రపంచంలో ఏమీలేదనుకున్నాను. ఎక్కడికైనా, బయల్దేరివెళ్లిపోవాలనుకున్నాను. ఎక్కడికివెళ్లాలో అనేవిషయం మాత్రం నిర్ణయం చేయలేకపోయాను. నాభర్త వదలి వెళ్లిన ఆఫీసుగదిలో నిరాశాహృదయంతో కుర్చీమీద కూలబడ్డాను. ఎక్కడచూచినా నిశ్శబ్దము, నిరాశ, ఆందోళన తాండవమాడుతూఉన్నట్టు తోచింది. నా పూర్వపు సంతోషదినాలు నెమరుకు రావటానికి ప్రారంభించాయి. నాభర్తతో గడపిన నాచిన్ననాటి చనువులు, వినిర్మల ప్రేమాలాపాలు, నాచెవిలో అప్పుడు వినబడ్డాయి. నేనే కుర్చీలో కూర్చున్నానో ఆకుర్చీలోనే నాభర్తగారు కూర్చోవటం, నేను వీణనువాయిస్తూ అతనికి సంతోషం కలిగించటం ఆసమయంలో అనుభవిస్తూఉన్నట్లనిపించింది. భగవానునకు భక్తునకుఉండే త్రివిధసంబంధములలో ప్రేమానురాగబద్ధులైన పత్నీపతుల మధ్యనుండే గాఢతమమైన నిష్కళంక ప్రేమానుబంధమువంటి అనుబంధము ఉత్తమోత్తమమైనదని పెద్దల అభిప్రాయము. అట్టి పత్నీపతుల అనురాగలతే మోక్షసామ్రాజ్యలక్ష్మీపథానుగమనము. అట్టి సౌఖ్యడోలికలో ఊగులాడుతూఉన్న ఇతర సౌఖ్యములు ఆ రోజులలో తృణములుగా కనబడేవి. నాకొకసారి జ్వరమువచ్చి ఏదో పలవరిస్తే సందియని గాబరాపడి నా ప్రక్కలో కూర్చొని తన కిక ప్రపంచంఅంతా నశించిపోతూఉన్నట్టు చూచే చూడ్కి ఇప్పుడు నాకు దృష్టిగోచరం అయింది. ఈ ఆలోచనాప్రవాహం హద్దూపద్దూలేకుండ ప్రవహిస్తూఉంది. ఇట్లు నన్ను నేను మరచియుండగా పోస్టుజవాను తెచ్చిన ఉత్తరం నన్ను నాకు జ్ఞాపకపరచింది. నే నా కవరును అందుకొని పైనవ్రాయబడిన లిపిని చూచాను. ఆలిపి నా భర్తగారిదే. ఇటువంటి సమయంలో నాకు వ్రాయవలసిన సంగతులు ఆయన కేమి ఉన్నవా అని ఆశ్చర్యపడ్డాను. కవరు మెల్లిగా మూతవిప్పాను. పైనఉన్న 'నా ప్రియమైన వసంతకు' అన్న ముక్క చదివాను. అడుగున నా భర్తగారి సంతకము చూచాను. ఎందుకో నాచేతులు వణికాయి. మధ్యఉన్న సంగతులు ఈవిధంగా చదువుకున్నాను.

మిగిలింది వచ్చేసంచికలో